

'సుంకేసుల'కు నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో ప్రస్తుతం 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉందని గురువారం డ్యాం అధికారులు తెలిపారు.



రూ. 2 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: మల్లికార్జున స్వామివార్ల ఆలయ పడమటి ధ్వజస్తంభానికి బంగారు తాపడం కోసం హైదరాబాద్‌కు చెందిన మహిసాయి శ్రీనివాస్‌బొజ్జిలి రూ.2లక్షలు విరాళమిచ్చారు.



జేఎల్‌ఎం జీవితాల్లో 'వెలుగు'

జూనియర్ లైన్‌మెన్ల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగు నింపింది. రెండేళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయడంతో వారి వేతనాలు రెట్టింపు కానున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్సీ ఎగ్జామ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కోఆర్డినేటర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ శాఖలోని శాంపిల్ టేకర్, మునిసిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్సీస్, వివిధ శాఖల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి ఈనెల 18, 22వ తేదీల్లో ఉదయం, సాయంత్రం ఆన్‌లైన్‌లో అయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వహించనున్న కంప్యూటర్ బేస్ట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని, మొబైల్ ఫోన్లు, ఎల్రక్టానిక్ వస్తువులను అనుమతించొద్దని ఆయా అధికారులకు సూచించారు. సమావేశంలో పరీక్షల సమన్వయ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజేశ్వరి, వైద్య ఆరోగ్యశాఖ ప్రతినిధి డాక్టర్ వై.నాగప్రసాదు, విద్యుత్ శాఖ ప్రతినిధి ఓబులేషు, శ్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎఫ్‌ఎంఎస్ - ఈ గ్రామ్ స్వరాజ్ ద్వారా చెల్లింపులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు సీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాకుండా ఇకపై పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్ ద్వారా చెల్లింపులు జరపాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన మండల పరిపాలనాధికారుల అవగాహన కార్యక్రమంలో సీఈఓ మాట్లాడారు. గత నెలలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు సర్దుబాటు చేశామన్నారు. శానిటేషన్, తాగునీరు, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు వాటిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం పీఎఫ్‌ఎంఎస్‌పై పరిపాలనాధికారుల అనుమానాలను కార్యాలయ సాంకేతిక సిబ్బంది ఎస్ఎండీ ఖలీలుల్లా, జ్యోతి నివృత్తి చేశారు.

నేడు ఉద్యోగులకు ప్రత్యేక స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగే స్పందనలో ఉద్యోగులు సమస్యలపై వినతులను సమర్పిస్తే పరిశీలించి పరిష్కారాలు చూపుతామన్నారు.

క్వింటా ఉల్లి రూ.2,300



కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర క్రమంగా పెరుగుతోంది. డిమాండ్ ఉండటంతో వ్యాపారులు గ్రామాలకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. గురువారం కర్నూలు మార్కెట్‌కు రెండు లాట్‌లు రాగా.. ఒక లాట్‌కు రూ.1800, మరో లాట్‌కు రూ.2300 ధర లభించింది. ఖరీఫ్‌లో ఉల్లి సాధారణ సాగు 15,483 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 10,048 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. దేశంలో ఉల్లి ప్రధానంగా మహారాష్ట్ర, ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎక్కువగా సాగవుతోంది. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలోనూ ఉల్లి ఆశాజనకంగా లేదు. ఇందువల్ల ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్లగా ఉల్లి ధర అంతంతమాత్రంగానే ఉంటోంది.

- కర్నూలు మార్కెట్‌కు వేరుశనగ పోటెత్తుతోంది. ముందస్తుగా బావులు, బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ దిగుబడులు మార్కెట్‌కు వస్తున్నాయి. గురువారం 158 మంది రైతులు 1,789 క్వింటాళ్ల వేరుశనగ తెచ్చారు. వేరుశనగకు కూడా గిట్టుబాటు ధర లభిస్తోంది. గరిష్టంగా రూ.8వేల వరకు ధర లభిస్తుండటం విశేషం.

మేయర్ ఓటు పునరుద్ధరణకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): నగర మేయర్ బీవై రామయ్యకు కర్నూలు నగరంలోనే ఓటును పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మేయర్ బీవై రామయ్య 19వ వార్డులో నివాసం ఉంటున్నారు. గతంలో ఆయనకు తన స్వస్థలమైన గడివేములతోపాటు కర్నూలులోనూ ఓటు ఉండేది. గడివేములలో తొలగించాలని ఆయన అర్జీ ఇచ్చారు. కాగా తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ పని ఒత్తిడిలో రెండు చోట్లా డిలీట్ చేసి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అతనిపై వేటు పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో గురువారం మేయర్ నుంచి కల్లూరు ఆర్‌ఐ లక్ష్మీనారాయణ ఫారం-6 స్వీకరించారు.

ఉద్యానానికి ఊతం.. ఉత్పాదకతకు ప్రోత్సాహం

రూ.8.03 కోట్లతో కార్యాచరణ

- గత ఏడాది 94,611 హెక్టార్లలో ఉద్యాన పంటలు
- 15.50 లక్షల టన్నులకు ఉత్పాదకతను పెంచేందుకు కసరత్తు
- ఈ ఏడాది లక్షకుపైగా హెక్టార్లలలో ఉద్యాన పంటలు సాగయ్యే అవకాశం
- యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



351 హెక్టార్లలో పండ్లతోటల విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటల అభివృద్ధి, ఉత్పాదకత పెంపు లక్ష్యంగా ఉద్యానశాఖ ముందుకు సాగుతోంది. 2022-23లో జిల్లాలో ఉద్యాన పంటల ఉత్పాదకత 11.36 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా.. ఈ సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా 2023-24లో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఏపీఐఐఏటీపీ కింద రైతులకు పలు ప్రోత్సాహకాలు ఇస్తుండటం విశేషం. ఎంఐడీహెచ్ కింద రూ.6.42 కోట్లు, రాష్ట్రీయ కృషివికాస్ యోజన కింద 1.02 లక్షలు, ఏపీఐఐఏటీపీ కింద రూ.58.77 కోట్లతో ఉద్యాన పథకాలు అమలవుతున్నాయి. ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాల ఏర్పాటు, హైబ్రిడ్ కూరగాయల సాగును ప్రోత్సహిస్తుండటం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8.02 కోట్లతో ఉద్యాన పథకాలను పకడ్బందీగా అమలు చేయడానికి ఉద్యానశాఖ రంగం సిద్ధం చేసింది.

రూ.4.04 కోట్లతో కోల్డ్‌స్టోరేజీలు, ఉల్లి గోదాములు.. కలెక్షన్ సెంటర్లు

ఈ ఏడాది రూ.2.72 కోట్లతో ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీ, ఉల్లి గోదాములు, కోల్డ్ రూములు నిర్మించడానికి ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. రూ.24 లక్షలతో 12 ప్యాక్‌హౌస్‌లు, రూ.1.40 కోట్లతో కోల్డ్ స్టోరేజీ, రూ.45.50 లక్షలతో 52 ఉల్లి గోదాములు, రూ.63 లక్షలతో 12 కోల్డ్ రూములు నిర్మిస్తారు. ఉద్యాన ఉత్పత్తులను క్లీనింగ్, గ్రేడింగ్ చేసుకోవడంతో పాటు ప్యాక్ చేసుకునేందుకు ప్యాక్‌హౌస్‌లు తోడ్పడనున్నాయి. జిల్లాలో ఉల్లి ప్రధాన పంట. ధరలు పడిపోయినప్పుడు కొద్ది రోజుల పాటు నిల్వ చేసుకునేందుకు ఉల్లి గోదాములు నిర్మిస్తుండటం విశేషం. ఉద్యాన ఉత్పత్తుల నిల్వకు కోల్డ్ స్టోరేజీతో పాటు కోల్డ్ రూములు కూడా ఉద్యాన శాఖ నిర్మిస్తోంది. రూ.1.32 కోట్లతో ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఇలా...

ఉద్యాన పంట రకం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ఉత్పాదకత (టన్నుల్లో)
కూరగాయలు	35610	7,31,465
పండ్లు	3585	70,753
సుగంధ ద్రవ్యాలు	54845	3,30,368
పూలు	450	4168
ఔషధ మొక్కలు	104	184
ప్లాంటేషన్ క్రాప్	17	12
మొత్తం	94,611	11,36,950



జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంట

ఉద్యాన యాంత్రీకరణకు ప్రోత్సాహం

ఉద్యానశాఖలో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉత్పాదకతను పెంచుకోవాలంటే యాంత్రీకరణ అత్యవసరం. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వారీగా ప్రభుత్వం కస్టమ్ హయరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. తాజాగా ఉద్యాన శాఖ రూ.24.33 లక్షలతో 146 యాంత్రీకరణ పనిముట్లను పంపిణీ చేస్తోంది. ఉద్యాన యాంత్రీకరణ కింద చిన్న ట్రాక్టర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళ రైతులకు 50 శాతం సబ్సిడీపై ఉద్యాన యంత్రీకరణ అమలు చేస్తుండటం విశేషం. ఉద్యాన ఉత్పాదకతను పెంచుకోవడానికి యాంత్రీకరణ అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి అవసరమైన వాటిని 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తోంది.

రూ.44.50 లక్షలతో ఫాంపాండ్స్

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పంటలకు రక్షక తడులు ఇచ్చి కాపాడుకునేందుకు ప్రభుత్వం ఫాంపాండ్స్‌ను తవ్విస్తోంది. జిల్లాకు ఎనిమిది ఫాంపాండ్స్ మంజూరయ్యాయి. ఇందులో రెండు కమ్యూనిటీ ఫాంపాండ్ ఉన్నాయి. కొంతమంది రైతులకు కలిపి సామూహికంగా వినియోగించుకునేందుకు 100X100X3 అడుగుల ప్రకారం కమ్యూనిటీ ఫాంపాండ్ తవ్విస్తారు. మిగిలినవి 20X20X3 అడుగుల ప్రకారం ఉంటాయి. 50 శాతం సబ్సిడీతో ఫాంపాండ్స్ తవ్వించేందుకు ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు ఎంఐడీహెచ్ కింద రూ.40 లక్షలు సబ్సిడీ ఇస్తోంది. వ్యక్తిగతంగా 6 పాంపాండ్స్ తవ్వుతారు.

- రాష్ట్రీయ కృషి వికాస్ యోజనను రూ.1.02 కోట్లతో అమలు చేస్తున్నారు. హైబ్రిడ్ కూరగాయల సాగు, కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు కోల్డ్ రూములు నిర్మిస్తారు. ఏపీఐఐఏటీపి కింద రూ.58.97 లక్షలతో చెరువుల కింద ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తారు. చెరువుల కింద అధిక నీటి వ్యయంతో చేపట్టే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వరి నుంచి ఉద్యాన పంటల సాగుకు వచ్చే రైతులకు 75 శాతం సబ్సిడీ లభిస్తుంది.

ఉద్యానశాఖ 40 శాతం సబ్సిడీతో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోంది. పండ్లు, కూరగాయలు, పూలతోటల అభివృద్ధికి సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద ఉద్యానశాఖ రూ.93.78 లక్షల సబ్సిడీ ఇస్తోంది. మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్స్, నిమ్మతోటల అభివృద్ధితో పాటు కూరగాయలు, పూల సాగును ప్రోత్సహిస్తుండటం విశేషం. దరఖాస్తుల స్వీకరణ, రైతుల ఎంపిక, మొక్కలు నాటించడం తదితర లక్ష్యాలను నవంబర్ చివరికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉద్యాన శాఖ చర్యలు చేపడుతోంది. 2021-22, 2022-23 సంవత్సరాల్లో 467.77 హెక్టార్లలో సాగు చేసిన ఉద్యాన పంటల నిర్వహణ(2, 3వ ఏడాది మెయింటెనెన్స్)కు రూ.19.63 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.

రక్షిత సాగుకు ప్రోత్సాహం

- ఉద్యాన శాఖ రక్షిత సాగు కింద మల్చింగ్, షేడ్‌నెట్ కింద కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది.
- ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ అవసరం ఎంతో ఉంది. పంటలను బట్టి అవసరమైన మందం 2.50 నుంచి 5అడుగుల వెడల్పు ఉన్న పాలిథిన్ షీట్‌లను వినియోగిస్తారు.
- మొక్కలు రావడానికి ఈ షీట్లకు అవసరమైన రంధ్రాలు కూడా ఉంటాయి.
- మల్చింగ్ సదుపాయం వల్ల కలుపు సమస్య ఉండదు.
- నేలలో తేమ ఆరిపోదు. పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయి.
- మల్చింగ్‌తో పాటు కూరగాయల సాగుకు షెడ్‌నెట్‌లు, దానిమ్మ తోటలను పరిరక్షించి కాయ నాణ్యతను పెంచేందుకు యాంటిబర్డ్‌నెట్‌లు కూడా ఉద్యానశాఖ ఏర్పాటు చేస్తోంది.
- 64 హెక్టార్లలో రక్షిత సాగును ప్రోత్సహించేందుకు రూ.10.93 లక్షల సబ్సిడీ ఇస్తోంది. రక్షిత సాగుకు ఉద్యానశాఖ 50 శాతం సబ్సిడీ కల్పిస్తోంది.

ఉత్పాదకత పెంపే లక్ష్యం



ఉద్యాన పంటల్లో ఉత్పాదకత పెంపు లక్ష్యంగా అనేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నాం. జిల్లాలో ప్రస్తుతం పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పూలు 94,611 హెక్టార్లలో సాగవుతున్నాయి. ఉత్పాదకత 11.36 లక్షల టన్నులు ఉంది. ఈ ఏడాది ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు ఉత్పాదకతను గణనీయంగా పెంచాలనే లక్ష్యంతో ఉన్నాం. ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు సంబందిత ఉద్యాన అధికారులను సంప్రదించవచ్చు.

– రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

చెన్నై కాలువకు నీటి విడుదల



చెన్నై కాల్వ గేటు ఎత్తుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

వెలుగోడు(నంద్యాల): వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చెన్నై కాల్వకు గురువారం నీటిని విడదల చేశారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వీబీఆర్ వద్ద ఒక గేట్ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ముందుగా రిజర్వాయర్ వద్ద గంగమ్మకు ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే సాగు చేసిన పంటలకు నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులతో చర్చించి వారం రోజుల పాటు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎండిపోతున్న పంటలకు జీవం పోసేందుకు కొద్దిపాటి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. వర్షాలు కురిసే వరకు కొత్తగా ఎవరూ వరినార్లు పోసుకోవద్దని, అధికారులకు రైతులు సహకరించాలన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



కర్నూలు సిటీ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫైల్‌పై సంతకం చేయడంతో గురువారం బీ.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషన్ జూనియర్ కాలేజీ కాంట్రాక్ట్ లెక్చరర్లు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు.

కేడీసీసీ బ్యాంకులో ఈ-స్టాంపింగ్ సేవలు



ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ మనోహరి, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ-స్టాంపింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. బ్యాంకుకు చెందిన 23 బ్రాంచీల్లో ఈ సేవలు అందిస్తామన్నారు. ఈ మేరకు గురువారం డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, ఆప్కాబ్‌తో ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఒప్పందం కుదుర్చుకుంది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సాంబశివారెడ్డి, నర్సిరెడ్డి, ఆప్కాబ్ తరపున డీజీఎం బాలాజీతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ-స్టాంపింగ్ సదుపాయం వ్యాపారులు, రియల్ ఎస్టేటు వ్యాపారులు, ఇతర అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. పారదర్శకమైన సేవలు కూడా అందుతాయన్నారు. ఖాతాదారులు, రైతులు, ఇతరులు తీవ్ర వ్యయ ప్రయాసలతో దూరప్రాంతాలకు వెళ్లి స్టాంపులు కొనుగోలు చేయాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఇవో పి.రామాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం ఎం.విజయకుమార్, డీసీసీబీ డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎంలు పాల్గొన్నారు.

ఆగస్టు 30న జగనన్న కాలనీల ప్రారంభోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 30న జగనన్న కాలనీల ప్రారంభోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లేఅవుట్‌కు వెల్కమ్ బోర్డును ఏర్పాటు చేసి నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా స్వాగత ద్వారాలు నిర్మించాలన్నారు. మే మాసంలో పంటలు వేసి నష్టపోయిన విస్తీర్ణాల్లో చిరుధాన్యాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనను సీఎస్ ఆదేశించారు. జాతీయ రహదారులు, ఫోర్ జీ నెట్‌వర్కుల నిమిత్తం బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జీయో మొదలగు సంస్థల టవర్లకు అవసరమైన భూసేకరణ పనులను త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, సీపీఓ అప్పలకొండ, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ నాగరాజునాయుడు, డీఆర్‌డీఏ పీడీ శివలీలా, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫిమేల్)లో రెండేళ్ల ఉచిత మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్(స్త్రీలు)/ఏఎన్ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణా కేంద్రంలో మొత్తం 40 సీట్లు ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ http://cfw.ap.nic.inను చూడాలన్నారు.

స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులు పరిశీలన



చర్చిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి కోసం వచ్చిన స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను గురువారం పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ పరిశీలించింది. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన 9, రెన్యువల్ కోసం వచ్చిన 11, మాడిఫికేషన్ వచ్చిన 9 దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. అనంతరం వీటిని డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య ప్రకటించారు. దీంతో పాటు ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రజలు, ఎన్జీఓల సాయంతో డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. సమావేశంలో గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ మాణిక్యరావు, పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ విజయానందబాబు, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు మొదలు పెట్టని ఇళ్ల నిర్మాణాలను వెంటనేల ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లు, ఇతర మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల్లో ఆశించిన మేరకు పురోగతి కనిపించడలలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కృష్ణగిరి, చిప్పగిరి, వెల్దుర్తి, కౌతాళం, కర్నూలు అర్బన్, కల్లూరు, పత్తికొండ, మంత్రాలయం, తుగ్గలి, కోసిగి ఎమ్మిగనూరు మండలాల్లో 50 శాతం బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని, వీటిని నెలాఖరులోపు బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలని సూచించారు. బేస్‌మెంట్ లెవల్ నుంచి కంప్లిషన్ స్థాయి ఇళ్ల నిర్మాణాల్లో స్టేజ్ కన్వర్షన్ చూపడంలో కోడుమూరు, కర్నూలు అర్బన్, వెల్దుర్తి, హాలహర్వి, ఆదోని అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. పురోగతి సాధించడానికి హౌసింగ్ ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. చిప్పగిరి మండలం డేగఐహాల్‌లో నిర్మాణంలో ఉన్న 20 ఇళ్లకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చే అడ్వాన్స్ రూ.20 వేలు అందించకపోవడంపై కలెక్టర్ ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. మరో వైపు కృష్ణగిరిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పురోగతిని చూపలేకపోతున్నామని కృష్ణ హౌసింగ్ ఏఈ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా...ఉన్న వాళ్లతో ఎక్కువ సమయం పనిచేయించి పురోగతి చూపేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25న ఐదు లక్షల ఇళ్ల గృహప్రవేశాలు ఉంటాయని, అందుకోసం లేఅవుట్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖలో జరుగుతున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కర్నూలు అర్బన్, మంత్రాలయం మండలాల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈరన్న ఉత్సవాలకు అంకురార్పణ



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి



పూజల్లో ట్రస్ట్‌బోర్డు చైర్మన్, అసిస్టెంట్ కమిషనర్, తదితరులు

- భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శ్రావణమాస పూజలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలకు ఆలయ అధికారులు అంకురార్పణ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో గురువారం మొదటి రోజు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయ పూజారులు స్వామి వారికి దీపారాధన, గోపూజతో పాటు సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాస ఉత్సవాల ప్రారంభానికి సూచికగా గోపురంపై స్వామి జెండాను ఆవిష్కరించారు. ఇక మొదటి రోజు భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించుకుని, ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవదాయశాక అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ఉత్సవాలు నెల రోజుల పాటు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సెప్టెంబర్ 11న చివరి సోమవారం రోజు స్వామి పల్లకీ మహోత్సవం ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహదేవ స్వామి, పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, వెంకటేష్ గ్రామ ప్రముఖులు, ఆలయ సిబ్బంది, ట్రస్టుబోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెదురులంక చిత్ర బృందం సందడి



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న హీరో కార్తికేయ

కర్నూలు(సిటీ): అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బెదురులంక సినిమా బృందం సందడి చేసింది. సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం హీరో కార్తికేయ (ఆర్ఎక్స్100 ఫేమ్) విద్యార్థినులతో కలిసి స్టెప్‌లేశారు. అనంతరం ఆయనకు కర్నూలుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈనెల 25న బెదురులంక సినిమా అన్ని థియేటర్లలో విడుదలవుతుందని, చిత్రాన్ని అందరూ చూసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ అశోక్‌వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యంమత్తులో పోలీసులపై దాడి

బొమ్మలసత్రం: మద్యం మత్తులో ఉన్న యువకులు నలుగురు పోలీసులపై బుధవారం అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన మధు, యశ్వంత్, తేజా, రాజేష్, వెంకటసాయి, సుదీర్‌లు అతిగా మద్యం సేవించి స్థానిక సాయిబాబానగర్ వద్ద రహదారిపై వెళ్లే వారిపై దురుసుగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకులను మద్యం పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మద్యం మత్తులో అక్కడ ఉన్న సెక్యూరిటీ, ఆసుపత్రి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులపై యువకులు దాడికి పాల్పడ్డారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నాణ్యతలో రాజీపడొద్దు



జీడీపీ గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు, గేట్ల మరమ్మతుల నాణ్యతలో రాజీ పడొద్దని జిల్లా నీటిపారుదలశాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన ఈఈ శైలేశ్వర్‌తో కలిసి ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం తక్కువ ఉన్నప్పుడే పనులు వేగంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. జీడీపీలో 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని, ఆనకట్ట ఎత్తు పెంచితే 5.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంటుందని చెప్పారు. ఫలితంగా తాగు, సాగు నీటి సమస్య తీరుతుందన్నారు. ఆయన వెంట డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ అలీ, పరమేష్, ఉగ్రనరసింహ పాల్గొన్నారు.

జేఎల్ఎం జీవితాల్లో ‘వెలుగు’

- జూనియర్ లైన్‌మెన్లను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం
- సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా గ్రేడ్–2 జేఎల్ఎంల నియామకం
- రెండేళ్లు ప్రొబేషన్ పూర్తి చేసిన వారికి క్రమబద్ధీకరణ
- 2022 జూలై నుంచే వర్తింపు.. రెట్టింపు కానున్న వేతనం
- ఉమ్మడి జిల్లాలో 650 కుటుంబాల్లో ఆనందం



పోల్ టెస్టులో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కుతున్న అభ్యర్థి (ఫైల్)

కర్నూలు(రాజ్‌విహార్): జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం)ల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగు నింపింది. రెండేళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసింది. 2019లో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సర్కారు.. ఖాళీల ఆధారంగా ఎనర్జీ అసిస్టెంట్లు/ జేఎల్ఎం గ్రేడ్–2ల పేరుతో నియామకాలు చేసింది. సచివాలయ ఉద్యోగుల తరహాలోనే వీరికి రెండేళ్ల ప్రొబేషన్ కాలం విధించింది. ఆ సమయాన్ని పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రయోజనం 2022 జూలై నుంచే వర్తించేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వీరి వేతనాలు రెట్టింపు కానున్నాయి. ఈ నిర్ణయంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 650 కుటుంబాల్లో వెలుగులు నిండాయి.

వైఎస్సార్ తరువాత జగనన్నే..

విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న లైన్‌మెన్ పోస్టుల భర్తీ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైంది. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేందుకు లైన్‌మెన్లు అవసరం. 2006లో రాజన్న కాంట్రాక్టు జూనియర్ లైన్‌మెన్ (సీజేఎల్ఎం) పోస్టులు భర్తీ చేశారు. అప్పట్లో 196 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినా 483 మంది స్తంభం ఎక్కి అర్హత సాధించి, తమకూ న్యాయం చేయాలని విన్నవిస్తే వారినీ విధుల్లోకి తీసుకున్నారు. అప్పటి నుంచి కొత్త నియామకాలకు బ్రేక్ పడింది. రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి, చంద్రబాబు సర్కార్లు పట్టించుకోలేదు.

సచివాలయ వ్యవస్థ ద్వారా భర్తీ

గ్రామ స్వరాజ్యం, పేదల వద్దకే పరిపాలన లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. అన్ని శాఖల అవసరాలు గుర్తించి ఉద్యోగాలు భర్తీ చేశారు. విద్యుత్ సేవల కోసం జేఎల్ఎం గ్రేడ్–2లను భర్తీ చేశారు. ఐటీఐ ఎలక్ట్రిషియన్ చదివిన వారికి అర్హత కల్పించారు. ఎవరి సిఫార్సులకు తావు లేకుండా విద్యుత్ స్తంభం ఎక్కడం, మీటర్ రీడింగ్, సైకిల్ తొక్కడం వంటి పరీక్షలు పెట్టి, అర్హతలు సాధించిన వారికే అవకాశం కల్పించారు. 80 శాతం పోస్టులు స్థానికులకు, 20 శాతం స్థానికేతరులకు ఇచ్చారు. దీంతో గ్రామాల్లో సిబ్బంది కొరత తీరింది.

కోవిడ్‌లో సేవలు.. తగ్గిన సమస్యలు

సచివాలయాలు రాక ముందు గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. మరమ్మతులు చేసే వారు ఉండేవారు కాదు. రాత్రి వేళల్లో చీకట్లు తప్పేవి కావు. జేఎల్ఎంల భర్తీతో అంతరాయ సమస్యలు తగ్గాయి. కోవిడ్ సమయంలో ప్రతి ఒక్కరూ ఇళ్లకే పరిమితమయ్యారు. ఆ సమయంలో విద్యుత్ ఎంతో అత్యవసరంగా మారింది. అప్పట్లో అంతరాయ సమస్యలు ఏర్పడకుండా, సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించారు.

650 కుటుంబాల్లో ఆనందం

2019లో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలోని 8 జిల్లాలకు 5,107 పోస్టులు భర్తీ చేయగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 658 పోస్టులు భర్తీ చేశారు. కర్నూలు డివిజన్‌లో 168 పోస్టులు భర్తీ చేయగా నంద్యాలలో 166, డోన్‌లో 116, ఆదోనిలో 196 మందిని నియమించారు. వీటిలో గ్రామ సచివాలయాలకు 508, వార్డు సచివాలయాలకు 150 మందిని కేటాయించారు. వీరిలో 8 మంది మృతిచెందగా రెండేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న 650 మందిని రెగ్యులర్ చేశారు.

రెట్టింపు కానున్న జీతం

రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న జేఎల్ఎంలను 2022 జూలై 1వ తేదీ నుంచే రెగ్యులర్ చేశారు. ఈ మేరకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారికి ప్రస్తుతం ఉన్న రూ.15 వేల జీతం రెట్టింపు కానుంది. దీనితో పాటు హెచ్ఆర్ఏ, డేర్‌నెస్ అలవెన్స్, ఇతర ప్రయోజనాలు ఇవ్వనున్నారు. రుణ సదుపాయం వర్తించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా కుటుంబాల్లో ఆనందం నెలకొంది.

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో మాకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. జేఎల్ఎం పోస్టులు భర్తీ చేసి ఎంతో మందికి జీవితాన్ని ఇచ్చారు. ఇప్పుడు రెగ్యులర్ చేశారు. 2022 జూలై 1వ తేదీ నుంచే దీనిని వర్తింపజేయడం సంతోషంగా ఉంది.

– టి.మద్దులేటి, జేఎల్ఎం, సెంట్రల్ సెక్షన్, కర్నూలు

మాకు జీవితాన్నిచ్చారు



జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాల భర్తీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. 2019లో పోటీ అధికంగా ఉన్నా అర్హతలు, పరీక్షల్లో పాస్ అయిన వారికే ఉద్యోగం ఇచ్చారు. అన్ని పరీక్షలు పాసవడంతో ఎవరి సిఫార్సు లేకండానే నాకు ఉద్యోగం వచ్చింది. 2022 జూలై నుంచి రెగ్యులర్ సర్వీసు కలపడం ఇంకా సంతోషం.

– ఎం.మహమ్మద్ రఫీ, జేఎల్ఎం, ప్యాలకుర్తి

సేవలు మెరుగుపడ్డాయి



జిల్లాలో విద్యుత్ అంతరాయ సమస్యలు ఏర్పడిన వెంటనే స్పందిస్తున్నాం. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2 పోస్టులను భర్తీ చేయడంతో సిబ్బంది కొరత తీరింది. దీంతో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలతో ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్ సమస్యలు బాగా తగ్గాయి. సేవలు మెరుగుపడడంతో పాటు ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాం.

– ఎం. ఉమాపతి, ఆపరేషన్స్ ఎస్ఈ, కర్నూలు.

విశాల్‌మెగా మార్ట్‌పై విజిలెన్స్ దాడులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణంలోని విశాల్ మెగా మార్ట్‌లో గురువారం విజిలెన్స్, జీఎస్టీ, మున్సిపల్, ఫైర్, లేబర్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మార్ట్‌లో జరుగుతున్న కొన్ని అవకతవకలను గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ విశాల్ మెగా మార్ట్‌లో ఆహారపదార్థాల నిల్వలో హైజినిక్ పద్ధతులను పాటించడం లేదన్నారు. బిల్డింగ్ అప్రూవల్, నో అబ్జెక్షన్ ధ్రువపత్రాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో మున్సిపల్ శానిటేషన్ అధికారులతో రూ.లక్ష జరిమానా విధించామన్నారు. పలు రకాలు వస్తువుల అమ్మకాలలో జీఎస్టీ వ్యత్యాసాలను జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రమణయ్య గుర్తించి నోటీసులు జారీ చేశారు. నిత్యావసర సరుకుల ధరల విషయంలో అవకతవకలు గుర్తించి రూ.25 వేల జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఓ రూఫస్, ఏఈ శ్రీనివాసులు, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీ నారాయణ, లేబర్ అధికారిణి విద్యావతి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి పాఠశాల మార్పు



అద్దె భవనంలోకి మార్పు చేసిన పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లెరూరల్: హుస్సేనాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గ్రామంలోని ఓ అద్దె భవనంలోకి గురువారం మార్పు చేశారు. ఈ పాఠశాలలో మొత్తం 38 విద్యార్థులు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. కాగా బుధవారం పాఠశాల గోడ కుప్పకూలిపోయింది. దీంతో వెంటనే అద్దె భవనంలోకి మార్చారు. కూలిన పాఠశాల గదిని ఎంఈఓ స్వరూప తనిఖీ చేసి హెచ్ఎం మద్దిలేటి నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అద్దెభవనంలోకి మార్పు చేసిన పాఠశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట సీఆర్‌టీ చంద్రుడు, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ పరిధిలోని బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ 2,070 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 180 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. అలాగే బీపీఈడీ నాల్గవ, డీపీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరుగుతాయన్నారు.

భార్యపై అనుమానంతో భర్త ఘాతుకం

- కుమారునికి పురుగు మందు తాపి తానూ ఆత్మహత్య



ఉజ్వల్ (ఫైల్)



మృతిచెందిన రాజు

దేవనకొండ: భార్యపై అనుమానంతో కుమారునికి పురుగుల మందు తాపి భర్త కూడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన దేవనకొండలో చోటు చేసుకుంది. ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాలు ఇవీ.. దేవనకొండకు చెందిన అనిత(27), బనగానపల్లె మండలం పెద్దరాజుపల్లె గ్రామానికి చెందిన ఎరుకల బసవరాజు(40) 13 సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. బసవరాజు ఓ మర్డర్ కేసులో ముద్దాయిగా ఉండి సుమారు 10 సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించాడు. భార్యపైన అనుమానంతో తరచూ గొడవలు పడుతూ ఉండేవాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత వీరు కర్నూలులో కాపురం పెట్టారు. తరచూ గొడవలు పడుతుంటే అనిత పుట్టినిల్లు అయిన దేవనకొండకి ఈ యేడాది మార్చి నెలలో వచ్చింది. ఇక్కడే ఒక ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ జీవనం గడుపుతోంది. అయితే అప్పుడప్పుడు దేవనకొండకు వచ్చి అనితను బెదిరించి బసవరాజు డబ్బులు తీసుకెళ్లేవాడు. గురువారం ఉదయం అనిత ఇంటికి వచ్చి తాను తెచ్చుకున్న వేటకొడవలితో పురుగు మందు డబ్బా పట్టుకొని భార్య, అత్తపై దాడి చేస్తూ వీరంగం సృష్టించాడు. అనిత తనను చంపుతాడనే భయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న చిన్నకుమారుడు ఉజ్వల్(04)ని ఇష్టానుసారంగా కొట్టిన బసవరాజు బలవంతంగా పురుగుల మందు తాపించి తనూ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రీ, కొడుకుని స్థానికులు దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బసవరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు ఉజ్వల్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటనతో దేవనకొండలో విషాదం అలుముకుంది.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): జిల్లాలో మనబడి నాడు-నేడు ఫేజ్–2 నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన వాటిని తప్ప అనుమతి లేని నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు ఫేజ్–2 కింద రూ.22.61 కోట్లు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలకు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ఖర్చు 87 శాతం ఉండగా.. హొళగుంద, కౌతాళం, నందవరం మండలాల్లో తక్కువ శాతం ఖర్చు నమోదైందన్నారు. అదనపు గదులను ఈ నెల 31లోగా పూర్తి చేయాల్సి ఉండగా, ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. కౌతాళంలో అదనపు తరగతి నిర్మాణానికి పరిపాలనా అనుమతులు తీసుకొని కేవలం మరమ్మతులు ఎలా చేపడతారని, వెంటనే కౌతాళం ఏఈపై కఠిన చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఈఈని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, కిచెన్ షెడ్స్‌ను ఈ నెల 19లోగా పూర్తి చేయాలన్నారు. బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 42 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఏసీఆర్‌లను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 19వ తేదీ నాటికి సిస్టమ్ డ్రాపౌట్స్, స్కూల్ డ్రాపౌట్స్ లేకుండా చూడడంతో పాటు ఓవర్ ఏజ్, అండర్ ఏజ్ ఉన్న వారిపై కూడా దృష్టి సారించాలన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులను ఓపెన్ స్కూల్స్‌లో చేర్పించడంతో పాటు చైల్డ్ ఇన్ఫో అప్‌డేట్ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఏ పీఓ డాక్టర్ కె.వేణుగోపాల్, డీఈఓ రంగారెడ్డి, పీఆర్ ఎస్ఈ కె.సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు, డీవీఈఓ జమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సాక్షి ఫొటోగ్రాఫర్ ప్రతిభ



వడ్డే శ్రీనివాసులు



అవార్డుకు ఎంపికైన ఫొటో

కర్నూలు(సెంట్రల్): జాతీయ స్థాయి ఫొటో కాంపిటీషన్–2023 పోటీల్లో కర్నూలుకు చెందిన సాక్షి ఫొటోగ్రాఫర్ వడ్డే శ్రీనివాసులు ప్రతిభ చాటాడు. ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో జాతీయ స్థాయి ఫొటో కాంపిటీషన్ నిర్వహించారు. దాదాపు 700 ఎంట్రీలు రాగా, అందులో జనరల్ ఫొటోగ్రఫీ విభాగంలో వడ్డే శ్రీనివాసులు మూడో కన్సోలేషన్ అవార్డును దక్కించుకున్నారు. ‘ఉడుత, కాకి జాతులు వేరైనా ఆకలి వాటిని కలిపింది’ అంటూ 2022 డిసెంబర్ 24న అద్భుతమైన ఫొటోను ఆయన తన కెమెరాలో బంధించారు. ఈ ఫొటో జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికవడం విశేషం. ఈ నెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆయన విజయవాడలో అవార్డును అందుకోనున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,628.23
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:87.562
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:2,384
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,787

రెండు స్టేషన్లలో స్టాపింగ్ సౌకర్యం

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు మీదుగా రాకపోకలు సాగిస్తున్న నాలుగు రైళ్లకు తెలంగాణలోని రెండు స్టేషన్లతో స్టాపింగ్ సౌకర్యం కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- యశ్వంత్‌పూర్ (బెంగుళూరు) నుంచి హజరత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లను మహబూబ్‌నగర్‌లో నిలిచేలా చర్యలు చేపట్టనట్లు వెల్లడించారు. నిజాముద్దీన్ వెళ్లే రైలు (నంబర్ 12649) కర్నూలులో తెల్లవారు జామున 4.19 గంటలకు వచ్చి, మహబూబ్ నగర్‌కు ఉదయం 6.14 గంటలకు చేరుకుంటుందని, యశ్వంత్‌పూర్‌కు వెళ్లే (12650) రైలు కాచిగూడలో ఉదయం 8.20 గంటకు బయలుదేరి, మహబూబ్ నగర్‌కు 10.19 గంటలకు, కర్నూలుకు 12.29 గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు. ఇది ఈ నెల 21వ తేదీ నుంచి ఆచరణలోకి వస్తుందని తెలిపారు.
- కాచిగూడ నుంచి చెంగల్‌పట్టు (తమిళనాడు) మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు షాద్‌నగర్ స్టేషన్‌లో నిలిచేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెంగల్‌పట్టు నుంచి కాచిగూడ (17651) వెళ్లే రైలు కర్నూలుకు తెల్లవారు జామున 3.33 గంటలకు, షాద్‌నగర్‌లో 5.59 గంటలకు, కాచిగూడలో ఉదయం 7.55గంటలకు ఉంటుందని, తిరుగు ప్రయాణంలో (17652) కాచిగూడలో సాయంత్రం 5 గంటలకు, షాద్‌నగర్‌లో 5.44 గంటలకు, కర్నూలులో రాత్రి 8.08 గంటలకు చేరుకుంటుందన్నారు. ఇది ఈ నెల 20వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.

వేడి నీళ్లు మీద పడి చిన్నారి మృతి

కర్నూలు(అర్బన్): వేడి నీళ్లు పడి ఎనిమిది నెలల చిన్నారి మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. నగరంలోని బుధవారపేటకు చెందిన నరసింహులు, జ్యోతి దంపతుల 8 నెలల బాలుడు ఈ నెల 15న ఇంట్లో వాటర్ హీటర్‌కు తగలడంతో నీరు మీద పడ్డాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

21 మంది డిబార్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం 21 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ సెమిస్టర్‌లో మొత్తం 5,899 మంది విద్యార్థులకు గానూ 5,210 మంది హాజరయ్యారని, మిగతా 689 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14 మంది, రావూస్ (ఎమ్మిగనూరు)లో, వెంకటేశ్వర (ఆత్మకూరు)లో, కేవీఎస్ (ఆళ్లగడ్డ)లో, ప్రతిభ (పత్తికొండ)లో ఒక్కొక్కరు చొప్పున డిబారైనట్లు వీసీ చెప్పారు.



శరవేగంగా సాగుతున్న పాత ముచ్చుమర్రి వంతెన నిర్మాణం



పగిడ్యాలలో పిల్లర్ల స్థాయికి చేరుకున్న పనులు

వంతెన కష్టాలు తొలగేలా!

- శిథిల బ్రిడ్జిల స్థానంలో కొత్తవి నిర్మాణం
- శాప్ చైర్మన్ చొరవతో రూ.3.40 కోట్లు మంజూరు
- రెండు వంతెనల నిర్మాణం ప్రారంభం



ప్రమాదకరంగా మారిన వంతెన (ఫైల్)

పగిడ్యాల: దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. ఇనుప చువ్వలు బయటకు తేలి.. సైడ్ వాల్ ఊడిపడి భయపెడుతున్నాయి. అలాంటి వంతెనలపై నిత్యం వందల మంది భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. శిథిల బ్రిడ్జిల స్థానంలో కొత్తగా నిర్మించాలని సమీప గ్రామీణ ప్రజలు గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చొరవ తీసుకుని సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే రెండు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాటు పనులు మొదలయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్ట్ పునరావాస పథకం కింద 1985–86 మధ్య కాలంలో కేసీ కాలువపై పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల ప్రజల సౌకర్యార్థం రెండు వంతెనలు నిర్మించారు. కాలక్రమేణా అవి శిథిలావస్థకు చేరాయి. దీంతో కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల, పడమర వనుములపాడు, పాలమర్రి, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ఆంజనేయనగర్ గ్రామాల ప్రజలు భయంతో ఆ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వంతెనల నిర్మాణానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చొరవ చూపడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.40 కోట్లు మంజూరు చేసింది. కొత్త బ్రిడ్జిలు అందుబాటులోకి తెచ్చేందుకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. జూన్ నెలలో పనులు ప్రారంభం కాగా ఇప్పటికే పిల్లర్ల స్థాయికి చేరుకున్నాయి. దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం అవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

కేసీ కాలువపై పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల వద్ద చేపట్టిన వంతెన పనులు రెండు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పిల్లర్స్ స్థాయిలో పనులు పూర్తి కావొచ్చాయి. కాలువలో నీరు లేకపోతే ప్లాట్‌ఫాం కోసం సెంట్రింగ్ పనులు కూడా ప్రారంభం అవుతాయి. నీరు వస్తే కొంత పనులకు అంతరాయం ఏర్పడుతుంది.

– రఘురామిరెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ, నంద్యాల